క్లుప్తంగా

రాజనాల బండలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో స్వామివారు

చౌడేపల్లె: రాజనాలబండలో వెలసిన శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాసం రెండో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. టెంపుల్ ఇన్స్పెక్టర్ భాను ప్రకాష్ పర్యవేక్షణలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

సదుం: మండలంలోని బత్తలవారిపల్లెలో నూతనంగా నిర్మించిన కార్యసిద్ధి ఆంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవ కార్యక్రమాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గంగపూజ, గణపతి పూజ, అఖండ దీపారాధన, మహామంగళ హారతి నిర్వహించారు. 18న హోమాలు, పంచామృతాభిషేకం, స్వామి వారి ఊరేగింపు, అన్నదానం, పాట కచేరీ, 19న విగ్రహ ప్రతిష్ఠ, కన్యా దర్శనం, మహా మంగళ హారతి, అన్నదానం, భజన కార్యక్రమాలు జరిపించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

వైభవంగా శనిత్రయోదశి

బైరెడ్డిపల్లె: మండలంలోని గంగినాయనపల్లె సమీపంలో వెలసిన శ్రీ శనిమహాత్ముని ఆలయంలో శనివారం శనిత్రయోదశి పూజలను వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకం నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు రామక్రిష్ణమాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ప్రారంభం

పలమనేరు: మండలంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. సబ్జెక్టుల వారీగా నిర్ణయించిన పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో జరిగిన సమావేశానికి ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం హాజరై పలు సలహాలు, సూచనలను చేశారు.

ట్రిపుల్ ఐటీకి రొంపిచెర్ల విద్యార్థి


శశిధర్

రొంపిచెర్ల: రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి సుంకర శశిధర్ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు భవిత కేంద్రం ఉపాధ్యాయిని అములు తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ వికలాంగుడైన శశిధర్ స్థానిక భవిత కేంద్రంలో వైద్య పరీక్షలు చేసుకుంటు రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో చదువుకున్నాడని వెల్లడించారు. విద్యార్థికి వైఎస్సార్ కడప జిల్లా ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చిందని వివరించారు.

గురుకులానికి ల్యాప్‌టాప్‌ల వితరణ


ల్యాప్‌టాప్‌లు అందిస్తున్న శివ తదితరులు

పుంగనూరు: పట్టణంలోని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ అంబాసిడర్ డాక్టర్ పి.శివ రూ.లక్ష విలువైన ల్యాప్‌ట్యాప్‌లను శనివారం స్థానిక కుమ్మరవీధిలోని గురుకుల ఫౌండేషన్‌కు వితరణగా అందించారు. ఈ మేరకు స్కూల్ నిర్వాహకులు మణికంఠకు వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిదులు కృష్ణమూర్తి, రాజేంద్ర, రాంకుమార్, శ్రీకాంత్, సురేష్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి ప్రశంసాపత్రం


ప్రశంసాపత్రం అందుకుంటున్న శివశంకర్

గుడుపల్లె: మండలంలోని యామగానిపల్లె పంచాయతీ కార్యదర్శి పీఎస్ శివశంకర్ ఉత్తమ సేవలకు ప్రశంసాపత్రం దక్కింది. శనివారం చిత్తూరులోని డీపీఓ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి చేతులమీదుగా ఆయన ప్రశంసాపత్రం అందుకున్నారు.

వైద్యురాలి హత్యాచారంపై

నిరసన జ్వాల

- సాధారణ వైద్య సేవలు బంద్
- రోడ్డెక్కి ర్యాలీలు, ధర్నాలు చేసిన ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు
- నల్ల బ్యాడ్జీలు ధరించి న్యాయం కోసం నినదించిన డాక్టర్లు


పలమనేరు: కొవ్వొత్తుల ర్యాలీలో వైద్యులు


పెద్దపంజాణి: మండల కేంద్రంలో ఆందోళనకు దిగిన వైద్యులు

పలమనేరు: ఆపదలో ఉన్న వారికి ప్రాణాలు పోసే వైద్యురాలి ప్రాణాలకే దిక్కులేకుండా పోయిందని స్థానిక ఏరియా ఆస్పత్రికి చెందిన వైద్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కోల్‌కతాలోని ఆర్‌జి కార్ ఆస్పత్రిలో ప్రభుత్వ వైద్యురాలిపై హత్యాచారానికి నిరసనగా శనివారం వైద్యులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఆపై ప్లకార్డులు చేయబట్టి న్యాయం కావాలంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ ప్రైవేటు ఆస్పత్రుల్లో సాధారణ సేవలను ఆపేశారు. వైద్యురాలి ఆత్మకు శాంతి కలగాలంటూ స్థానిక ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు శనివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ మమతారాణి, ఆర్ఎంవో శారద, యుగంధర్, స్టేట్ మెడికల్ ఎంప్లాయిస్ నేతలు సరోజ, రాధతోపాటు పలువురు వైద్యులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో..

గంగవరం: వైద్యురాలి హత్యను నిరసిస్తూ మండలంలోని గంగవరం, పత్తికొండ పీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బంది కలిసి శనివారం నిసరన తెలిపారు. వైద్యాధికారులు శ్రీనివాసులు, లహరి, మల్లికార్జునరెడ్డి, ఆరోగ్య సిబ్బంది, పాల్గొన్నారు.

రహదారిపై ర్యాలీ

పెద్దపంజాణి: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారంపై మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు సిబ్బందితో కలసి పలమనేరు–పుంగనూరు రహదారిపై ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. పెద్దపంజాణి పీహెచ్‌సీ డాక్టర్ టి.మురళి, ప్రైవేటు వైద్యులు జాఫర్, సుబ్రమణ్యం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

రొంపిచెర్ల/ సదుం: కోల్‌కత్తాలో వైద్యురాలిపై హత్యాచార ఘటనకు నిరసనగా రొంపిచెర్ల, సదుం మండలాల్లో వైద్య సిబ్బంది ఆందోళనకు దిగారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రొంపిచెర్ల వైద్యాధికారులు దినేష్ కుమార్ నాయక్, వినయ్, సీహెచ్‌ఓ కాంతమ్మ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సదుం డాక్టర్లు రూపానంద్, అన్నపూర్ణ, సోమేశ్వరరెడ్డి, శ్రీనివాస్, సుబ్రమణ్యం, భార్గవి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

నిరసన ర్యాలీ

పుంగనూరు: పుంగనూరు ఏరియా ఆస్పత్రి వైద్యాధికారి శరణ్ ఆధ్వర్యంలో డాక్టర్లు, సిబ్బంది నిరసన ర్యాలీ నిర్వహించారు. అలాగే ముడిబాపనపల్లె పీహెచ్‌సీలో డాక్టర్లు సల్మాబేగం, సృజన, తేజశ్రీ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మురళిబాబు, హరిప్రసాద్‌రెడ్డి, దేవప్రసాద్, ఆహనాంద, శ్రావణి పాల్గొన్నారు.


సదుంలో వైద్యుల నిరసన


పుంగనూరులో నిరసన తెలుపుతున్న వైద్యులు



గంగవరం: పీహెచ్‌సీ ఎదుట ప్లకార్డుల ప్రదర్శన, పలమనేరు ఏరియా ఆస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులు

కృష్ణాష్టమి వేడుకలకు ఆహ్వానం

వి.కోట: త్రైత సిద్ధాంతం వారి ఆధ్వర్యంలో మండలంలో నిర్వహించే కృష్ణాష్టమి వేడుకలకు శ్రీ కృష్ణుని భక్తులందరూ ఆహ్వానితులేనని వి.కోట ప్రబోధా సేవా సమితి వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సమితి వారు మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి సెప్టెంబర్ 2వ తేదీ వరకు శ్రీ కృష్ణుని పూజ కార్యక్రమాలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 26వ తేదీ సోమవారం శ్రీ కృష్ణాష్టమి పండగతో వేడుకలు మొదలై 2వ తేదీ స్వామి వారి ఊరేగింపు కార్యక్రమంతో ముగుస్తుందని తెలిపారు. ఈ ఆహ్వాన పత్రికను శనివారం ఎంఈఓ చంద్రశేఖర్‌కు, 2వ ఎంఈఓ మురుగేష్‌కు అందించి ఆహ్వానించినట్లు చెప్పారు.

అధ్వానం.. మధ్యాహ్న భోజనం!


ఇంటి నుంచి భోజనం తెచ్చుకున్న విద్యార్థినులు

- పాఠశాలల్లో తినలేకపోతున్నామని విద్యార్థుల ఆవేదన
- ఇంటి నుంచే భోజనం తెచ్చుకుంటున్న వైనం
- పట్టించుకోని కొత్త ప్రభుత్వం


ఇంటి నుంచి భోజనం తెచ్చుకుని పాఠశాలలో తింటున్న విద్యార్థినులు

పెద్దపంజాణి: గత ప్రభుత్వంలో రుచికి, శుచికి మారుపేరుగా ఉన్న మధ్యాహ్న భోజనం నేడు అధ్వానంగా మారింది. ఫలితంగా విద్యార్థులు ఇంటి నుంచి క్యారియర్లు తెచ్చుకుని భోజనం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం రాగానే ప్రభుత్వ బడులను గాలికి వదిలేసింది. యూనిఫాం కానీ, మధ్యాహ్న భోజనం నాణ్యతను కానీ పట్టించుకోవడం లేదు. ఫలితంగా పేద విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తినలేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. దీంతో ఇంటి నుంచి క్యారియర్లు తెచ్చుకుని భోజనం తింటున్న సంఘటన చోటుచేసుకుంటోంది. ఈ పాఠశాలలో దాదాపు 600 మంది విద్యార్థులున్నారు. వారం రోజులుగా మధ్యాహ్న భోజనం సక్రమంగా లేదని, తినలేక పస్తులుండాల్సి వస్తోందని విద్యార్థులు వారి తల్లిదండ్రుల వద్ద వాపోయారు. దీంతో తప్పని పరిస్థితుల్లో పిల్లలకు ఇంటి నుంచే భోజనం పంపిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి మధ్యాహ్న భోజనం నాణ్యతను, మెనూను సక్రమంగా పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

అర్బన్ సీఐగా నరసింహరాజు



పలమనేరు: పలమనేరు యూపీఎస్ సీఐగా నరసింహరాజు శనివారం విధుల్లో చేరారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న చంద్రశేఖర్ వీఆర్‌కు వెళ్లారు. ఇక్కడ విధుల్లో చేరిన సీఐ నరసింహరాజు మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు పెద్దపీట వేస్తామన్నారు. ట్రాఫిక్ సమస్య, టౌన్‌లో అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెడతామన్నారు.

ఐకమత్యమే యూనియన్ బలం

చిత్తూరు కలెక్టరేట్: పాత్రికేయులు ఐకమత్యంగా ఉండడమే యూనియన్‌కు బలమని, జిల్లాలో పాత్రికేయుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అన్నారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) 67వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఏపీయూడబ్ల్యూజే, చిత్తూరు ప్రెస్‌క్లబ్ సంయుక్తంగా కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ చేతుల మీదుగా కేక్ కట్ చేయించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ దశాబ్దాల చరిత్ర ఉన్న ఏపీయూడబ్ల్యూజే నాయకుల పోరాటాలు మరవలేనివన్నారు. కలెక్టర్‌కు యూనియన్ నాయకులు మొక్కను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా కన్వీనర్, చిత్తూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు లోకనాథన్, ప్రెస్‌క్లబ్ సెక్రటరీ అశోక్‌కుమార్, ఉపాధ్యక్షుడు మహేశ్, సంయుక్త కార్యదర్శి షకీల్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మకు దరఖాస్తుల ఆహ్వానం

బైరెడ్డిపల్లె: గ్రామీణ చేతి వృత్తిదారులు పీఎం విశ్వకర్మ పథకానికి అర్హులని, మండలంలోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ రాజేంద్రబాలాజీ పేర్కొన్నారు. వడ్రంగులు, కమ్మరులు, సుత్తి, తాళాల తయారీదారులు, బంగారు పనిచేసేవారు, శిల్పులు, రాతి ప్రతిమలు చెక్కువారు, చర్మకారులు, పాదరక్షల తయారీదారులు, గంపలు, చాపలు, చీపుర్లు తయారీదారులు, క్షురకులు, రజకులు, దర్జీలు, చేపలు పట్టే వారు ఈ పథకానికి అర్హులన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

పర్యవేక్షించే వారికే చైర్మన్ పదవి ఇవ్వాలి

బైరెడ్డిపల్లె: మండలంలోని కీలతొరిడి ప్రాథమిక పాఠశాల ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ పదవిని నిరంతరం పర్యవేక్షించే వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకే ఇవ్వాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. పాఠశాల ఎస్ఎంసీ కమిటీ చైర్మన్‌ను ఎంపిక చేయడానికి శనివారం ఎంపీడీఓ రాజేంద్రబాలాజీ, ఎంఈఓలు వేణుగోపాల్‌రెడ్డి, సుబ్రమణ్యం, పోలీసులు పాఠశాల వద్దకు చేరుకున్నారు. పాఠశాలలో 29 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో 19 మంది తల్లిదండ్రులు ఉన్నారు. ఒకరు హాజరు కాకపోగా టీడీపీ మద్దతుదారులకు 8 మంది, వైఎస్సార్‌సీపీ మద్దతుదారునికి 10 మంది చేతులెత్తారు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారునికి అధిక మెజారిటీ ఉన్నా అధికారులు కోరం లేదంటూ వాయిదా వేశారు. దీంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు రాజకీయ కక్షసాధింపుల కోసమే అధికారులు టీడీపీ నేతలకు వత్తాసుపలుకుతున్నారని మండిపడ్డారు.

అయ్యప్ప స్వామి సన్నిధిలో పెద్దిరెడ్డి


కాలినడకన అయ్యప్ప సన్నిధికి వెళుతున్న పెద్దిరెడ్డి, ద్వారకనాథరెడ్డి, మిథున్‌రెడ్డి

సదుం: శబరిమలై అయ్యప్పస్వామివారిని సన్నిధానానికి మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి శనివారం దర్శించుకున్నారు. పంబ నుంచి వారు ఇరుముడులు తలపై ధరించి కాలినడకన అయ్యప్ప సన్నిధికి చేరుకున్నారు. ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి పాల్గొన్నారు.

దోమ లార్వాలపై డ్రోన్లతో దాడి


డ్రోన్‌తో మందు పిచికారీ చేస్తున్న అధికారులు

చిత్తూరు అర్బన్: దోమల వృద్ధిని నియంత్రించడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, నీటి కుంటల్లో దోమ లార్వాలను నాశనం చేయడానికి డ్రోన్లతో మందును పిచికారి చేస్తున్నట్లు చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ జె.అరుణ చెప్పారు. నగరంలోని బాలాజీ కాలనీ, ఓబనపల్లి ప్రాంతాల్లో శనివారం నీటి కుంటలు, నీటి నిల్వ ప్రాంతాల్లో డ్రోన్ల సాయంతో వెక్టోబాక్ బయోలాజికల్ ఇన్‌సెక్టిసైడ్ మందును పిచికారీ చేశారు. మనుషులు వెళ్లలేని నీటి కుంటలు, నిల్వ నీటి ప్రాంతాల్లో డ్రోన్ల సాయంతో మందును పిచికారీ చేస్తున్నామన్నారు. నిల్వ నీటిలోని దోమ లార్వాలను నాశనం చేయడం ద్వారా దోమల పెరుగుదలను నియంత్రించవచ్చన్నారు. అధికారులు గుర్తించిన దోమల వృద్ధి ఎక్కువగా ఉన్న 8 బ్లాక్ స్పాట్ ప్రాంతాల్లో డ్రోన్ల సాయంతో దోమ లార్వాల నియంత్రణకు మందులను పిచికారీ చేస్తున్నామన్నారు. ప్రతి 15 రోజులకోసారి ఈ ప్రక్రియను కొనసాగించనున్నట్లు కమిషనర్ తెలిపారు. కమిషనర్ వెంట ప్రజారోగ్యశాఖ అధికారి డా.అనిల్ కుమార్ నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్య ఉన్నారు.

నీటి కొళాయి సర్వే

నగరంలో జరుగుతున్న ఇంటింటికీ నీటి కొళాయి సర్వేను టెలిఫోన్ కాలనీ కమిషనర్ పరిశీలించారు. ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా నీటిని అందించాలని ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సర్వే నిర్వహిస్తుందని, క్షేత్రస్థాయిలో పక్కాగా నిర్వహించాలన్నారు. కార్యదర్శులు ప్రతి ఇంటికీ వెళ్లి కొళాయి కనెక్షన్ ఉందా లేదా? రికార్డుల్లో నమోదైనవి, నమోదు కానివి? రికార్డుల్లో నమోదయి ఉండి కనెక్షన్ లేనివి? నీరు ఏ సమయంలో సరఫరా అవుతుంది వంటి వివరాలు పక్కాగా నమోదు చేయాలన్నారు. ప్రతి ఇంటికీ శుభ్రమైన నీరు సరఫరా చేయాలనే లక్ష్యంతో చేస్తున్న ఈ సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సర్వేను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ రమణ, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అబ్బా.. ఇది ఏమి ఎండ!

- మే నెలను తలపిస్తున్న ఆగస్టు
- ఉదయం నుంచే మండుతున్న భానుడు
- చల్లటి ప్రాంతంలోనూ తప్పని ఉక్కబోత
- బెంబేలెత్తిపోతున్న జనం


ఎండకు బోసి పోయిన అంబేడ్కర్ సర్కిల్

పలమనేరు: జిల్లాలోనే పలమనేరుకు పేదవాని ఊటీగా పేరుంది. సాధారణంగా ఇక్కడ వేసవిలోనూ కాస్త చల్లటి వాతావరణం ఉంటుంది. గత మూడేళ్లుగా వేసవిలో ఇక్కడ ఎండలు మండిపోతున్నారు. ఏటా జూలై నుంచి ఇక్కడ ఎండలు తగ్గుముఖం పడతాయి. కానీ వేసవిని తలపిస్తూ పలమనేరులో గత పదిరోజులుగా ఎండలు మండుతున్నాయి. సాధారణంగా ఆగస్టులో ఇక్కడి గరిష్ట ఉష్ణోగ్రతలు 27 డిగ్రీలుగా ఉంటాయి. కానీ ఇప్పుడు 31 నుంచి 33 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. ఇళ్లల్లో ఫ్యాన్లు నిరంతరం తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. వీధుల్లో జన సంచారం కూడా మధ్యాహ్నం పూట అస్సలు కనిపించడం లేదు.

వర్షాభావ పరిస్థితులే కారణమా?

వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎండలు పెరిగినట్టు తెలుస్తోంది. ఈ మధ్య వర్షాలు కురిసినా ఎండలు తగ్గలేదు. గతంలో ఎప్పుడూ ఇలాంటి ఎండలను ఆగస్టులో చూడలేదని స్థానికులు చెబుతున్నారు. ఉక్కబోత కారణంగా దుస్తులన్నీ చెమటతో తడిసిపోతున్నాయి. పలమనేరు ప్రాంతంలో ఎండలు ఇలా ఉంటే మొగిలి ఘాట్ దిగాక చిత్తూరు, తిరుపతి ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.


అంతరిస్తున్న కౌండిన్య అడవులు

పలమనేరు ఫారెస్ట్ రేంజి పరిధిలోని కౌండిన్య అభయారణ్యం ఏటా అంతరిస్తోంది. ముఖ్యంగా వేసవిలో అడవికి నిప్పు పెట్టడం ద్వారా ఇక్కడ చాలా వరకు అడవి అగ్నికి ఆహుతైంది. అడవుల్లో వృక్షాలను నరకడం, వర్షాలు లేక బీడుబారి అడవి బలహీనపడుతోంది. ఈ కారణాలు ఇక్కడ వాతారణ పరిస్థితులపై ప్రభావం చూపుతున్నాయి. అడవులు తరిగిపోతున్న నేపథ్యంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని పర్యావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

కూలీలకుఎండదెబ్బ

ప్రస్తుతం ఈ ప్రాంతంలో వరినాట్లు సాగుతున్నాయి. వరినాట్లకు వచ్చే కూలీలు సైతం ఎండల కారణంగా పెద్దగా పనులకు రావడం లేదు. ఎక్కువ ఉష్ణోగ్రతల కారణంగా పంటలకు సైతం నీటి తడులు ఎక్కువగా ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో వ్యవసాయ కరెంట్ వినియోగం ఈ నెలలో భారీగా పెరిగింది. ఉపాధి పనులు సైతం తగ్గుముఖం పట్టాయి.


ఈ ఎండలు ముందు లేవు



నా వయస్సు 60 దాటింది. పలమనేరులో పుట్టి పెరిగాను గానీ గతంలో వేసవిలో మధ్యాహ్నం పూట ఎండలుండేవిగానీ ఆగస్టులో ఇలాంటి ఎండలను ఎప్పుడూ చూడలేదు. ఇంట్లో ఏసీలు ఫ్యాన్లులేంది కుదరడం లేదు. పోనీ చల్లగా ఉంటుందని పొలాలవద్దకెళ్లినా ఉక్కబోత తప్పడం లేదు. ముఖ్యంగా ఇళ్లలో ఉండే వృద్ధులు, కూలీలకు ఎండబాధ ఎక్కువగా ఉంది. భారీ వర్షాలు పడితేగానీ ఉష్ణోగ్రతల్లో మార్పు రాదేమో.

– పుష్పరాజ్, పలమనేరు

ఈ జాగ్రత్తలు తప్పనిసరి



ఆగస్టు నెలలో ఈ దఫా ఎండలు మండుతున్నాయి. ఎండలోకెళ్లే ముందు తలపై టోపీ గానీ, గొడుగు లేదా తలపాగా ధరించాలి. కళ్లకు నల్లటి కూలింగ్ కళ్లద్దాలు పెట్టుకోవడం మేలు. కూలి పనులు చేసే వారు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఎక్కువ ఎండలో ఉండరాదు. నీటితో పాటు కొబ్బరి బొండాలు, పుచ్చకాయలులాంటివి తీసుకోవాలి. ఉదయం పూట మనిషి శరీరానికి చలువ చేసే రాగి జావ వేసవి తాపానికి ఎంతో విరుగుడు.

–డాక్టర్ మల్లికార్జున రెడ్డి, పలమనేరు

తిరుమలకు భక్తుల పాదయాత్ర


పాదయాత్రగా తిరుమలకు బయలుదేరిన భక్తులు

గంగవరం: తిరుమల స్వామివారి దర్శనార్థమై కొత్తపల్లెకు చెందిన భక్తులు దాదాపు 200మంది శనివారం పాదయాత్రగా బయలుదేరారు. మండలంలో టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీ కోనేటిరాయ స్వామి ఆలయంలో ఉదయం భక్తులు గోవింద మాలలు ధరించారు. కొత్తపల్లి సర్పంచ్ గిరిరాజా రెడ్డి ఆధ్వర్యంలో భక్తులు గోవిందనామాలు ఆలపిస్తూ పాదయాత్రను ప్రారంభించారు. గ్రామం నుంచి గత 20 ఏళ్లుగా తిరుమలకు పాదయాత్రగా వెళుతున్నామని భక్తులు తెలిపారు.

వాయిదా

పుంగనూరు: పుంగనూరు మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. శనివారం నిర్వహించాల్సిన మండల మీట్‌కు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు రాకపోవడంతో వాయిదా వేసినట్లు అధికారులు వెల్లడించారు.